బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

కసాయి కాంగ్రెస్ కథ కంచికే!

'నర్తకుని నాట్యాలు, గాయకుని గానాలు, వాదకుని వాద్యాలు, శిల్పకుని శిల్పాలు, చిత్రకుని చిత్రాలు, కవిరాజు కావ్యాలు కర్షకా నీ కర్రు కదిలినన్నాళ్లెరా' అన్నారు తెలంగాణ ప్రజాకవి కాళోజీ. ఆ మాటలకు అర్థం దేశానికి అన్నం పెట్టే రైతన్న సాగు సరిగా ఉంటేనే మనమంతా బాగుంటామని. ఇది అక్షరసత్యం. రాష్ట్రంలో వ్యవసాయం బాగు కావడానికి 60 ఏండ్లు దొరకని సమాధానం కేవలం తొమ్మిదిన్నరేండ్లలో దొరకడానికి ఏకైక కారణం మన విజనరీ ముఖ్యమంత్రి కేసీఆర్.

రైతును కడుపులో పెట్టుకొని చూసుకొన్న ప్రభుత్వం ఈ దేశంలోనే కాదు, బహుశా ఈ ప్రపంచంలోనే ఎక్కడా లేదని నా ప్రగాఢ విశ్వాసం. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తెలంగాణలో కరెంటు, నీళ్లు లేవు. రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, వలసలు పోవుడు, చాలా భయంకరమైన బాధలుండేవి. కుటుంబమంతా చెట్టుకొకరు, గుట్టకొకరు అయ్యారు. ఇవన్నీ సునిశితంగా గమనించిన అప్పటి ఉద్యమనేత, ప్రస్తుత సీఎం కేసీఆర్ పాలన చేపట్టిన వెనువెంటనే అనేక అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. ముఖ్యంగా వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచారు. అంతేకాదు దేశంలో ఎక్కడా లేని విధంగా 450 సంక్షేమ పథకాలతో కేసీఆర్ సర్కారు అగ్రభాగాన ఉన్నది.

విషాదకరమైన విషయం ఏంటంటే మనరాష్ట్రంలో గాడ్సేలు గాంధీభవన్‌కు వచ్చిన తర్వాత తెలంగాణ కాంగ్రెస్ పార్టీ స్వరం మారింది. దురదృష్టం ఏంటంటే, తరం మారుతున్నా తన వైఖరి మాత్రం కాంగ్రెస్ పార్టీ మార్చుకోవడం లేదు. లక్ష్య సిద్ధి కోసం బొంత పురుగునైనా ముద్దాడాలనే కేసీఆర్ ముందు కాంగ్రెస్ వైఫల్య ఎత్తుగడలు ఏమాత్రం పనిచేయడం లేదు. తన గమ్యం కోసం చావు నోట్లో తలపెట్టిన నేత ఆయన. ఆ మహనీయుడి కృషితో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగిన సమయంలో సీమాంధ్ర పాలకులు, ఇదే కాంగ్రెస్ నాయకులు కొత్తరాష్ట్రం ఏర్పడితే కరెంటు ఉండదని, తెలంగాణ చీకటవుతుందని, భూముల ధరలు పడిపోతాయని భయపెట్ట చూశారు. అలాంటిది ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ.

వ్యవసాయ స్థిరీకరణ జరుగాలని రైతులను బాగు చేసుకున్నాం. రైతుబంధు పేరుతో రైతన్నల అకౌంట్లలో రూ. 72 వేల కోట్లు వేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ అనటంలో అతిశయోక్తి కాదు. కానీ, కొంతమంది కాంగ్రెస్ నేతలు రైతుబంధు దుబారా అంటున్నారు. 24 గంటల కరెంటు వద్దు. 3 గంటలు చాలంటున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని సూచిస్తున్నారు. ఇదీ వ్యవసాయంపై వారి దృక్పథం. పూర్తిగా వ్యవసాయాధారిత రాష్ట్రమైన తెలంగాణలో ఆ పార్టీ నాయకులకు వ్యవసాయం మీద కనీస అవగాహన లేకపోవడం దురదృష్టకరం.

రైతుల భూములకు నష్టం కావొద్దని ప్రభుత్వం ధరణిని తీసుకొచ్చింది. ధరణి పోర్టల్‌తోనే రైతుల భూములు సేఫ్‌గా ఉన్నాయని ఒక పక్క రైతులు చెప్తుంటే, దాన్ని తొలగించాలని కాంగ్రెస్ అగ్రనేతలు చెప్పటం హాస్యాస్పదం. ఇటువంటి వైఖరి కల్గిన కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలని చెప్పి, అనేక పథకాలను ప్రవేశపెట్టి పేదలకు పంచుతున్నది. ఇవన్నీ ఉండాలంటే, మళ్ళీ మన కారు పార్టీ సారును గెలిపించాలి. లేదంటే, పదేండ్లు పడిన శ్రమ వృథా అవుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలి.

నా పార్లమెంట్ పరిధిలోని పలువురు అభ్యర్థుల వెంట నేను ప్రచారంలో తిరుగుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరి మదిలో కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలే కదలాడుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే, బీఆర్ఎస్ సర్కారు తన సంక్షేమ పథకాల ద్వారా ఎంతోమందిని కదిలించింద న్న విషయం నాకు అవగతమైంది. ఏ గ్రామం చూసినా మరే తండా చూసినా అపూర్వ స్పంద న లభిస్తున్నది. అద్భుతంగా అభివృద్ధి చెందిన ఈ రాష్ట్రంలో మళ్లీ పాత కథ నే రావాల్నా. అదే జరిగితే మన రాష్ట్ర ప్రజల కథ కంచికి చేరుతుంది. ఇవన్నీ యువత, బుద్ధిజీవులు ఆలోచించాలి. ఎన్నో ఉద్యమాలు, మరెన్నో బలిదానాల ఆధారంగా ఏర్పడిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే దారికి వచ్చింది. కాపాడుకోవలసిన అవసరం, ఆవశ్యకత అందరిపై ఉన్నది. బీఆర్ఎస్ పార్టీ చెప్తున్నట్టు 24 గంటల కరెంట్ కావాల్నా! కాంగ్రెస్ చెప్తున్నట్టు 3గంటలే కావాల్నా? రైతుబంధు కావా ల్నా? రాబందు కావాల్నా? ఏది కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని సీఎం కేసీఆర్ పదేపదే చెప్తున్నారు.

> 58 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు నీళ్లు ఇవ్వకుండా, కరెంటు తేకుండా ప్రజలను అరిగోసపెట్టింది. పదేండ్లుగా పార్లమెంట్ చట్టాలను ఉల్లంఘించి బీజేపీ ఇబ్బంది పెడుతూనే ఉన్నది. ఇక్కడ ఉన్న ఆ పార్టీ ఎంపీలకు అడిగే దమ్ములేదు. వారివి ఎంతసేపు మతోన్మాద, కులోన్మాద ప్రకటనలు తప్ప చేసిందేమీ లేదు.

ఇవాళ ఏ ముఖం పెట్టుకొని ఓట్లడిగేందుకు వస్తున్నరు. కాంగ్రెస్, బీజేపీలతో తెలంగాణకు చాలా ప్రమాదం పొంచి ఉన్నది. కనుక ఆ పార్టీలను ప్రజలు నమ్మొద్దు. మూడోసారి అధికారంలోకి రాగానే ఇప్పుడున్న పథకాలతోపాటు కొత్త వాటిని బ్రహ్మాండంగా ముందుకు తీసుకువెళ్లే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అనివార్యత మనందరిపై ఉన్నది.

డాక్టర్ జి. రంజిత్ రెడ్డి
(వాసకర్త: పార్లమెంట్ సభ్యులు, చేవెళ్ల)

సమైక్యరాష్ట్రంలో అరవై ఏండ్లు వెనుకబడ్డ తెలంగాణను పదేండ్లలో కేసీఆర్ నాయకత్వంలో ఇటు సంక్షేమంలో, అటు అభివృద్ధిలో జోడెద్దులుగా ఏకకాలంలో ముందుకు నడిపించుకుంటున్నాం. 'ప్రతి ఇంటిలో సంక్షేమం, ప్రతి ముఖంలో సంతోషం'అనే రీతిలో 'సంక్షేమం అందని ఇల్లు లేదు అభివృద్ధి జరుగని ఊరు లేదు'

> పరిపాలనను గాడిలో పెట్టడానికి ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్క సమస్యను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాం. కరెంటు, సాగునీరు, తాగునీరు సమస్యలకు పరిష్కారం చూపి పరిపాలనలో కేసీఆర్ మార్కును చూపించారు. తెలంగాణ బిడ్డల బతుకులు బాగుపరచడానికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారు.

పాలనలో మానవీయకోణం

సంక్షేమ పథకాల అమలు విషయంలో గత పాలకుల మాదిరిగా ఓట్ల రాజకీయం లేదు. ప్రజల ఆర్థిక, సామాజిక, జీవన స్థితిగతులు మెరుగుపరచాలన్న ఒక ఉన్నతమైన లక్ష్యం తప్ప. తెలంగాణ అభివృద్ధి ఫలాలను రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అందజేయాలన్న కేసీఆర్ ఉన్నతమైన మానవీయ కోణం ఈ సంక్షేమ పథకాల రూపకల్పనకు స్ఫూర్తినిచ్చింది. ప్రజల పట్ల, ప్రజల అవసరాల పట్ల, ప్రజల ఆకాంక్షల పట్ల ఉద్యమ నేతగా కేసీఆర్‌కు పూర్తిస్థాయి అవగాహన ఉన్నది. వారి జీవన స్థితిగతుల్లో మార్పును తీసుకురావడానికి అనుగుణంగా సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారు. ముఖ్యంగా వికలాంగులకు భరోసాగా నిలుస్తున్న విధానం వికలాంగుల జీవితాల్లో కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. వికలాంగులకు నేనున్నానంటూ ఆత్మవిశ్వాసాన్ని పెంచారు ముఖ్యమంత్రి కేసీఆర్. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో దివ్యాంగుల పింఛన్లకోసం ప్రభుత్వం రూ.10,310.36 కోట్లకు పైగా ఖర్చు చేసింది. ఒక్క పింఛన్‌లే కాకుండా వారి జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి అనేక అవకాశాలను ఉచితంగా వారికి అందజేయడం జరుగుతున్నది.

రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో.. సంక్షేమ పథకాల లబ్ధిదారులు కేసీఆర్‌కు మద్దతు తెలియజేసి ఇదే ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకోవాలన్న కృతనిశ్చయంతో ఉన్నారు. పదేండ్ల తెలంగాణ ప్రయాణంలో దివ్యాంగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో భరోసానిచ్చింది. దేశంలో కాంగ్రెస్, బీజేపీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం మాదిరిగా వికలాంగులకు రూ. 4016లు పింఛన్ అందించటం లేదు. ఏ దరఖాస్తు లేకున్నా, వికలాంగుల నుంచి ఏ విజ్ఞప్తి లేకున్నా పింఛన్‌ను పెంచిన చరిత్ర మన ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. అంతేకాకుండా తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగుల పింఛన్‌ను ఏకంగా రూ. 6,016 లకు పెంచుతామని బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొనడం వికలాంగులకు మరింత సంతోషాన్ని ఇచ్చే అంశం.

ఏదేమైనా ఈ పదేండ్లలో దివ్యాంగుల సమాజానికే కాదు, పేద బడుగు బలహీన వర్గాలకు కుల మత భేదాలు లేకుండా సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలను అందజేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. దేశంలో ఎక్కడ కూడా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. ప్రతి సంక్షేమ పథకంలోనూ మానవీయ కోణం దాగి ఉన్నది. ఒక గొప్ప ఆశయం దాగి ఉన్నది. ఉద్యమ నేతగా అటు ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన ముఖ్యమంత్రిగా, ఇటు తెలంగాణ అభివృద్ధిలోనూ దేశానికి స్ఫూర్తినిస్తున్నారు. అందుకే తెలంగాణ ప్రజలు ఎల్లప్పుడు కేసీఆర్ వెంటే ఉంటారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా ఈ విషయాన్ని విస్పష్టంగా మరొకసారి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

డా.కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి
95530 86666
(వాసకర్త :రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్)

ఓటు

ఓటే నీ పరమాత్మయు
ఓటే నీ ఊరువాడ ఉన్నతికెపుడున్
ఓటును చేటుగ తలపక
ఓటును వేయగ కదలుడు ఓటరులారా.

ప్రజలకు చేరువ నిలబడి
ప్రజాసమస్యలనుదీర్చు పాలనయనగన్
రుజువునుజేయుచు ఓట్లను
నిజాయితిగ గెలుచుకొనుడు నేతల్లారా.

నమ్ముకున్నజనుల నట్టేటముంచుచున్
పగలసిగలురగుల తగవులాడి
తాగిఊగుచు పెడదారినబడి నడ
యాడువారి ఓటు కీడుదెచ్చు.

ఎన్నోకలలనుకనుచున్
ఎన్నికలొచ్చినిలిచె మన ఎదుటనునేడున్
ఉన్నతమౌ ఓటునుగని
ఎన్నుకొనవలె మహనీయ ఏలికనెవరో.

నోట్లను చూపించి అధిక
సీట్లను కాజేయు నక్కజిత్తులవారిన్
ఓట్లవిలువతో సమ్మెట
పోట్లకు గురిజేయగవలె బుధజనులింకన్.

రాకుమార
95501 84758

ముదిరాజులంతా కేసీఆర్ వెంటే

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 67 ఏండ్లలో జరుగని ముదిరాజ్‌ల అభివృద్ధి గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో జరిగిందనేది వాస్తవం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఆర్థిక చేయూతనిచ్చి ముదిరాజ్‌లను ఆదుకున్నది. రాష్ట్రం ఏర్పడ్డాక సమగ్ర కుటుంబ సర్వే ద్వారా ముదిరాజ్‌లను బీసీ కులాల్లో అతిపెద్ద సామాజిక వర్గంగా గుర్తించింది. వారికి అనేక రకాల సంక్షేమ పథకాలను రూపొందించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నది కేసీఆర్ ప్రభుత్వం.

ఏకులానికైనా రాజకీయ ప్రాతినిధ్యం మాత్రమే సరిపోదు. కులస్తులందరి అభివృద్ధి, సంక్షేమం ప్రాతిపదిక కావాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేళ్లుగా ముదిరాజ్‌లకు ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని తీసుకొచ్చి నీలివిప్లవంలో తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపింది. రాష్ట్రంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా కొండపోచమ్మ, మల్లన్నసాగర్ తదితర రిజర్వాయర్లను నింపింది. జలాశయాల్లో మత్స్య సంపద పెరిగి మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరిగింది.

2013-14లో తెలంగాణ మత్స్య సంపద 2.4 లక్షల టన్నులు కాగా 2022-23 నాటికి 4.37 లక్షల టన్నులకు చేరింది. తెలంగాణ ఏర్పడేనాటికి మత్స్యకారుల ఆదాయం రూ.2,479 కోట్లు మాత్రమే. అది ఇవ్వాళ రూ.7,259 కోట్లకు పెరిగి తొమ్మిదిన్నరేండ్లలో మూడింతలైంది. 2014లో 2 వేల మత్స్య సహకార సంఘాలుంటే నేడు అవి 6 వేలకు చేరాయి. సంఘాల్లో సభ్యత్వం 2.65 లక్షల నుంచి 4 లక్షలకు చేరింది. మెంబర్ షిప్ డ్రైవ్ ద్వారా స్కీంలకు అర్హత సాధించడంతోపాటు అప్పటి వరకు విడివిడిగా ఉన్న ముదిరాజ్‌లు సంఘటితం కావడానికి దోహదపడింది. ముదిరాజ్‌లకు రూ.1,000 కోట్ల బడ్జెట్‌ను ఐఎఫ్‌డీఎఫ్ పథకం ద్వారా కేటాయించి 75శాతం సబ్సిడీపై వలలతో పాటు టూవీలర్స్, ఫోర్ వీలర్స్, త్రీ వీలర్స్, ట్రాలీ తదితరాలను పంపిణీ చేయడం జరిగింది.

జీవో.నెం.268/2021 ద్వారా గ్రామపంచాయతీ ఆధీనంలో ఉన్న చెరువులను మత్స్యశాఖ పరిధిలోకి తీసుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం 2022లో జీవో నంబర్ 4ను తీసుకొచ్చి ముదిరాజ్ అనే పదాన్ని చేర్చి ముదిరాజ్ మత్స్యకారులకు మత్స్య సంపదపై పూర్తి హక్కులను కల్పించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నీటి వనరులు సమృద్ధిగా పెరిగి 6.5 లక్షల హెక్టార్లుగా ఉన్ననీటి వసతి కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ ద్వారా 7.76 లక్షల హెక్టార్లకు పెరిగింది. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే ఇంకో 50 వేల హెక్టార్ల నీటి వసతి అందుబాటులోకి వస్తుంది. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ కాలం నుంచి ముదిరాజ్‌లకు ప్రాధాన్యమిస్తూ టికెట్లను కేటాయిస్తున్నది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈటల రాజేందర్‌కు కేబినేట్‌లో కీలకమైన ఆర్థికశాఖను ఇచ్చి ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని పెంచారు. డాక్టర్ బండా ప్రకాశ్‌ను సీఎం కేసీఆర్ 2018లో రాజ్యసభకు పంపించి డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నియమించి గౌరవించారు. రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన మార్పు వల్ల 2021లో బండా ప్రకాశ్‌ను ఎమ్మెల్సీని చేసి మండలి డిప్యూటీ చైర్మన్‌గా నియమించారు. వీటితోపాటు ముదిరాజ్‌లకు ఆత్మగౌరవ భవనాలు, నామినేటెడ్ పదవులు ఇచ్చి ముదిరాజ్‌ల సంస్కృతి, సంప్రదాయాలను గుర్తించి జీవం పోశారు.

వివిధ రకాల స్కీంలు, రాజకీయ పదవులు, నామినేటెడ్ పోస్టుల ద్వారా ముదిరాజ్‌లకు ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో తోడ్పాటునందించిన బీఆర్ఎస్ మరోసారి అధికారంలో కి రావాలి. ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలి.

సీహెచ్ దినేష్ కుమార్
98490 50305
(వ్యాసకర్త : చైర్మన్, విద్యావంతుల వేదిక, తెలంగాణ ముదిరాజ్ మహాసభ)

> కేసీఆర్ ఈ పేరు వింటే చాలు, దశాబ్దాల కలను సాకారం చేసిన పోరాట పటిమ, అరిగోస పడుతున్న తండ్లాటను తీరానికి చేర్చిన తెగువ కండ్లముందు కదలాడుతది! రాజీలేని విద్యార్థుల త్యాగాలు, స్వరాష్ట్రం కోసం సబ్బండ వర్గాల ఆరాటాలు, స్వపరిపాలన కోసం అమరుల బలిదానాలు ఇన్ని వెలకట్టలేని వాటికి తన రాజకీయ పోరాటంతో తెలంగాణ ఆకాంక్షను మరింత పదునెక్కించిన యోధుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. ఇదంతా చరిత్ర. చరిత్రను విస్మరించిన వారికి భవిష్యత్తు నిర్మాణంపై భరోసా ఇచ్చే బాధ్యత, భవిత గురించి మాట్లాడే కనీస హక్కు ఉండదు, ఉండబోదు.

ఉద్యమ నేతనే గెలిపిద్దాం

ఎట్లుండే తెలంగాణ? ఇప్పుడెట్లున్నది! ఔ.. బరాబర్ ఇది బరి గీసి అడగాల్సిన సవాల్! బరిగీసి కొట్లాడినోళ్లం కదా బరాబర్ అడిగి తీరాల్సిన ప్రశ్నే ఇది! ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల కోసం, నిధుల కోసం, అంతెందుకు, ఆత్మగౌరవం కోసం, అస్తిత్వం కోసం అంగలార్చినోళ్లం కదా మనమంతా? మరి ఇప్పుడు నా తెలంగాణ, సిరిగల్ల మా బంగారు తెలంగాణ అంటూ గల్లా ఎగరేసి మరీ చెప్తలేమా? ఈ గర్వం కేసీఆర్ ఇచ్చిందే కదా? నాడు తెలంగాణ అంటే రాళ్లు రప్పలు, తెలివి లేనోళ్లు, పొద్దున లేవలేనోళ్లు, తాగుబోతులు అంటూ పనిగట్టుకొని ఇజ్జత్ తీసినోళ్లే ఇప్పుడు ఈ తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ ఆకాశానికెత్తేస్తున్నారంటే కేసీఆర్‌ది క్రెడిట్ కదా? తీసివేతలు చాలా ఉన్నాయంటారా? సరే కూడికలు ఏమి లేవా? బరాబర్ ఉన్నాయి! తీసివేతలున్నాయి, కూడికలున్నాయి లెక్కలున్న చోట అన్నీ ఉంటాయి.

తెలంగాణను కేసీఆర్ కుటుంబం మాత్రమే పరిపాలిస్తోందని, కుటుంబ పాలన అని కాంగ్రెస్ విమర్శిస్తున్నది. సరే అసలు ఈ దేశంలో కుటుంబ పాలనకు అంబాసిడర్ కదా కాంగ్రెస్. అలాంటప్పుడు వారసత్వ రాజకీయాలను విమర్శించే హక్కు ఆ పార్టీకెక్కడిది? వాళ్లు గర్వంగా ప్రకటించుకున్న ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌నే తెగనరికి భార్యాభర్తలకు టిక్కెట్లు ఇచ్చుకున్న గురివింద నీతి కదూ కాంగ్రెస్‌ది? మాట్లాడితే కర్ణాటక ఫార్ములాను తెలంగాణలో అమలు చేస్తమని కాంగ్రెస్ నేతలు చెప్తున్నరు. కరెంట్ లేక ఆ కన్నడ రైతులు ఆక్రందనలు చేస్తున్నరు. సబ్‌స్టేషన్లలో మొసళ్లు వదిలి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు! హామీలు, గ్యారెంటీలు అమలు చేయలేకపోతున్నాం మన్నించండి మహాప్రభో అంటూ కర్ణాటకలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ముక్కు నేలకు రాస్తున్నారు! అంతెందుకు కర్ణాటక రైతులు కొడంగల్ నుంచి హైదరాబాద్ వరకు నిరసనలు వ్యక్తం చేస్తే వాళ్లపై దాడి చేసింది ఇదే కాంగ్రెస్ కాదా? ఎట్ల నమ్మాలి వీళ్ల జూఠా మాటలను? ఎట్ల నమ్ముతం కాంగ్రెస్ పసలేని గ్యారెంటీలను, హామీలను? జర సోచో!

కేసీఆర్ మాత్రమే తెలంగాణను పరిపాలించాలా? వేరెవ్వరూ వద్దా? అంటే వై నాట్? ఇది ప్రజాస్వామ్యం! మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నిరాటంకంగా అమలవుతున్న దేశం మనది! ఎవరైనా అధికారంలోకి రావచ్చు! నిర్ణయించాల్సింది ప్రజలు. ఎందుకంటే ప్రజలే చరిత్ర నిర్మాతలు, న్యాయనిర్ణేతలు. కానీ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోతాయనేది వాస్తవం! లోపాలున్నాయి నిజమే సరిచేసుకుందాం! సమాధానాలు రావాలి నిజమే ప్రశ్నిద్దాం!

తెలంగాణ మేమే ఇచ్చినం అంటూ మైకులు విరిగిపోయే స్పీచ్‌లు ఇచ్చేటోళ్లకు ఉండేది అధికార దాహం! ఊపిరిని అడ్డువేసి తెలంగాణ తెచ్చుకున్నోళ్లకు ఉన్నది, ఉండేది మమకారం. వేరేవరికి లేని మమకారం! అందుకే మరోసారి కేసీఆర్‌కు సహకారం అందిద్దాం. తప్పైయినా ఒప్పైయినా సరే మనమే చూసుకుందాం! మనం మాత్రమే చూసుకుందాం!

విజయ్ సాధు

ప్రజాస్వామ్యానికి పట్టం కడుదాం

> శాసన సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాల్ని ప్రకటించింది. కాగా బీజేపీ సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ నినాదంతో పాటు బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రచారం చేస్తున్నది. అధికార బీఆర్ఎస్ మాత్రం ఈ రెండు జాతీయ పార్టీలు ఒకే నాణేనికి ఉండే బొమ్మ-బొరుసు లాంటివని, వీటిని నమ్ముకుంటే మిగిలేదేం లేదని ఎద్దేవా చేస్తున్నది. అన్ని రాజకీయ పార్టీలు విజయం తమదంటే తమదని భుజాలు చరుచుకుంటూ హేమాహేమీలతో సుడిగాలి ప్రచారం నిర్వహిస్తున్నాయి.

గత ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 76.50 శాతం ఓటింగ్ నమోదు కాగా హైదరాబాద్‌లో అత్యల్పంగా 50 శాతం మాత్రమే ఓటింగ్ నమోదయ్యింది. నియోజకవర్గం పరంగా వరంగల్ జిల్లా లోని నర్సంపేట్ లో 84 శాతం ఓటింగ్ నమోదు కాగా హైదరాబాద్‌లోని యాకుత్‌పురలో కేవలం 45 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ప్రత్యేకించి గ్రేటర్ హైదరాబాద్‌లోని 24 అర్బన్ స్థానాల్లో కేవలం 40 నుంచి 55 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. తక్కువ పోలింగ్ శాతానికి ప్రధానంగా పట్టణ ప్రాంత విద్యాధికుల నిర్లిప్తతే కారణం.

కార్పొరేట్, ఐటీ, ఇతర రంగాల్లో పని చేసే చాలా మంది ఉద్యోగస్తులు పోలింగ్ రోజును కేవలం ఒక సెలవు దినంగా పరిగణించి సరదాగా సమయం గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా భారత రాజ్యాంగం ద్వారా తమకు సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకోవటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. వారు ప్రభుత్వాలను నిందించటం తప్ప వ్యవస్థ బాగు కోసం తమలాంటి వారి సహకారం అవసరమన్న విషయాన్ని గుర్తించకపోవడం విడ్డూరం. విద్యావంతులు, సమాజాన్ని ప్రభావితం చేయగలిగే వ్యక్తులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థ ప్రక్షాళనకు నడుం బిగిస్తే పరిస్థితి తప్పకుండా ఆశాజనకంగా మారుతుంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా, ఏమాత్రం దూరదృష్టి లేకుండా కేవలం అధికార పగ్గాలు చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కొందరు రాజకీయ నాయకులు తమకు తోచిన విధంగా వాగ్దానాలు గుప్పిస్తున్నారు. సామాజికంగా వంచనకు గురైన అట్టడుగు వర్గాలను, అర్హులైన పేదలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. అయితే ఆ పథకాలు లబ్ధిదారులను స్వావలంబన దిశ గా పయనింపచేసి, వారిలో ఆత్మవిశ్వాసం పాదుకొల్పి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉండాలి. అంతే తప్ప సోమరిపోతులుగానో, జీవితాంతం పరాన్నజీవులుగానో మిగిలిపోయేలా చేయకూడదు.

కాంగ్రెస్ చెప్పిన హామీలు అమలు కావాలంటే ఏటా రూ.50 లక్షల కోట్ల బడ్జెట్ కావాలి. ఇప్పుడున్న తెలంగాణ బడ్జెట్ కేవలం 3 లక్షల కోట్లే. ఆ పార్టీ ప్రకటించిన వాగ్దానాలు అమలు కావాలంటే 30 ఏండ్లు పట్టవచ్చని లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ్ తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యను విజ్ఞులైన ఓటర్లు గమనించాలి.

రాజకీయ పార్టీలు ఎన్ని ఎత్తుగడలు వేసినప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో మెజారిటీ ఓటర్ల నిర్ణయమే శిరోధార్యం. చైతన్యవంతులైన ఓటర్లే ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు. ప్రలోభాలకు ఏ మాత్రం లొంగకుండా నిర్భీతితో ఓటు హక్కును వినియోగించుకుని దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా తమ బాధ్యతను నిర్వర్తించాలి. ప్రజాస్వామ్య స్ఫూర్తికి పట్టం కట్టాలి.

యేచన్ చంద్రశేఖర్
88850 50822